క్లుప్తంగా

రేపు శ్రీచౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట


చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్టకు ముస్తాబవుతున్న ఆలయం

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి మసికొండపై వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈనెల 9న చౌడేశ్వరీదేవి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. విగ్రహ ప్రతిష్టలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం


మూలపెద్దమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, ఆకు పూజలు నిర్వహించారు. భక్తులకు వాల్మీకి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

పాణ్యం: ఎస్సీ వర్గీకరణ సాధనే తమ లక్ష్యమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ తెలిపారు. ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో చేపట్టనున్న మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభ పోస్టర్లను మంగళవారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలతోపాటు ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. విశ్వరూప మహాసభకు అన్ని రాష్ట్రాల నుంచి మాదిగలు, ఉప కులాలు రానున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్‌ఆర్‌పీఎస్ నాయకులు బాబు, తిమ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి సమీక్ష సమావేశాలు

ఓర్వకల్లు: మండలంలోని సచివాలయాలలో ఈ నెల 9వ తేదీ నుంచి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మండల విస్తరణాధికారి సుబ్బరాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలి విడత కింద ఎంపికైన సచివాలయాలలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 9వ తేదీన ఓర్వకల్లు, 10న కన్నమడకల, 14న ఎన్ కొంతలపాడు, 15న హుసేనాపురం-1, 16వ తేదీన కాల్వ-2, 17న సోమయాజులపల్లె, 20న కొమరోలు, 21న కాల్వ-1, 22న బ్రాహ్మణపల్లె, 23వ తేదీన శకునాల గ్రామ సచివాలయాల పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజు సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే సమావేశాలలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలంటే' అనే అంశంపై ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి అభిప్రాయాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశాలకు సంబంధిత సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు తప్పక హాజరు కావాలని సూచించారు.

16న వ్యాసరచన పోటీలు

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం-1994పై సిటీ స్థాయి వ్యాసరచన పోటీలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆర్డీటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. 11 నుంచి 14ఏళ్లలోపు వారిని జూనియర్స్‌గా, 14 ఏళ్ల పైబడిన వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. వివరాలకు వెంకటరమణ కాలనీలోని మొదటి లైన్‌లో ఉన్న వైస్ కంప్యూటర్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీ లోపు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి, డిప్యూటీ మాస్ మీడియా అధికారి చంద్రశేఖర్, లయన్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, అడ్వకేట్ సుమలత, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు, జేజేబీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగముని, రెండవ పట్టణ ఎస్ఐ ఖాన్, గైనకాలజిస్ట్ నర్మద పాల్గొన్నారు.

స్పాట్ బిల్లింగ్ రెండు రోజుల్లో పూర్తి కావాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులకు స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇల్లు, షాపుల వద్ద ఉన్న మీటర్ వద్దకు వెళ్లి, బిల్లింగ్ స్కానర్‌తో ప్రతి డిజిటల్ మీటర్‌ను స్కాన్ చేసి రీడింగ్ తీయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. స్కాన్ కాకపోవడం, వాడిన యూనిట్ల కంటే రీడింగ్ హెచ్చు తగ్గలు రావడం వంటి సమస్యలు తలెత్తితే రీడర్లు వెంటనే ఏఈల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు.

మహా నగరంగా తీర్చిదిద్దుతున్నాం

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- రూ.కోట్లు వెచ్చించి శాశ్వతంగా అభివృద్ధి అడుగులు
- కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధిపై సుదీర్ఘ చర్చ


మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న మూడు నియోజకవర్గాల అధికారులు

కర్నూలు (టౌన్): మహా నగరంగా కర్నూలును తీర్చిదిద్దుతున్నామని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. రూ.కోట్ల నిధులు వెచ్చించి శాశ్వతమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం సాయంత్రం నగరపాలక కౌన్సిల్ హాల్‌లో కర్నూలు, పాణ్యం, కోడుమూరు నియోజకవర్గ స్థాయి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంత్రి సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో మూడు నియోజకవర్గాల్లో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర శివారులోని టిడ్కో గృహాల్లో నివసిస్తున్న కుటుంబాల కోసం రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేసి, బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే టిడ్కో గృహాల వద్ద ఆఫీసు ఏర్పాటు చేసి లబ్ధిదారులు ఇళ్లు చూసేందుకు వచ్చినప్పుడు ఏ బ్లాకులో ఏ ఇల్లు ఉందన్న వివరాలను తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని టిడ్కో ఎస్ఈని ఆదేశించారు. టీవీ-9 కాలనీకి సంబంధించి 2009 వరదల సమయంలో 1,250 ఇళ్లు ఇవ్వడం జరిగిందని, అయితే అక్కడ లబ్ధిదారులు లేరని కోడుమూరు ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ గృహాల కింద 1, 2 దశల్లో 8,447 గృహాలు జగన్నాథ గట్టు వద్ద 2007 నుంచి 2009 వరకు లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని మంత్రి చెప్పారు. అక్కడ మురుగునీటి వ్యవస్థ, నీటి సదుపాయం, శానిటేషన్ పనులు చేపట్టేందుకు అంచనాలను రూపొందించి తనకు సమర్పించాలని హౌసింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఎమ్మిగనూరులోని టిడ్కో ఇళ్ల పురోగతి గురించి ఆరా తీశారు.

ఓల్డ్ టౌన్‌లోని కరెంట్ సమస్యను పరిష్కరించాలి

ఓల్డ్ టౌన్‌లో సమస్యగా ఉన్న కరెంట్ సప్లయ్ వైర్లను త్వరితగతిన మార్చేందుకు చర్యలు చేపట్టాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మంత్రిని కోరారు. టిడ్కో గృహాల వద్ద పోలీస్ ఔట్‌పోస్టు, స్కూల్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ టాయిలెట్స్‌కు సంబంధించి లేబర్ లేకపోవడంతో నిర్వహణ సక్రమంగా లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. నగరంలోని పండ్లు, చేపల మార్కెట్లకు అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో అనువైన స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. క్రైస్తవ, ముస్లిం శ్మశాన వాటికలకు కూడా అనువైన స్థలాలను ఇవ్వాన్నారు.

స్థలం చూపించాల్సి ఉంది

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ బి.తాండ్రపాడు ప్రజలకు 277 సర్వే నంబర్‌లోని 39 ఎకరాల్లో 1,400 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామని, అయితే వారికి స్థలం చూపించాల్సి ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. గాజులదిన్నె, సుంకేసుల నుంచి కర్నూలు నగరానికి తాగునీటి సరఫరా చేస్తున్నారని, అలాగే కోడుమూరు నియోజకవర్గానికి తుంగభద్ర డ్యామ్ నుంచి నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తెచ్చారు. నిడ్జూరు గ్రామంలో అందరికీ ఇళ్ల పట్టాలు అందించామని, అయితే రెండవ వార్డు బీసీ కాలనీలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. తుంగభద్ర పరివాహక ప్రాంతంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, సుంకేసుల నుంచి లింగాలదొడ్డి వరకు రహదారి నిర్మాణం, రేమట గ్రామంలో కిలోమీటర్ మేర పెండింగ్‌లో ఉన్న రహదారిని పూర్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆర్‌డీఓ హరిప్రసాద్, నగరపాలక కమిషనర్ భార్గవతేజ పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య రానివ్వొద్దు

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గ పరిధిలోని 16 వార్డుల్లో తాగునీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారని, ప్రతిరోజూ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. పాత కల్లూరు వక్కెర వాగు వద్ద కొత్త బ్రిడ్జి మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఓర్వకల్లు, తిప్పాయిపల్లె గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, అలాగే పందిపాడు లే అవుట్‌కి సంబంధించి హౌస్ సైట్స్, కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 21వ వార్డు మహాలక్ష్మీ నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలన్నారు. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కాటసాని మంత్రిని కోరారు.

విద్యార్థికి అస్వస్థత

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థి దినకర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దినకర్ మంగళవారం తెల్లవారుజామున మూత్ర విసర్జన అనంతరం డార్‌మెట్రీలో పడుకున్నాడు. కొద్ది సేపటికే కడుపు నొప్పిగా ఉందని తోటి విద్యార్థికి, నైట్ వాచ్‌మెన్‌కు చెప్పాడు. పాము కాటుకు గురయ్యాడనే అనుమానంతో వారు ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల క్వార్టర్స్‌లో ఉన్న అధ్యాపకులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు.

కళాశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

చిన్నటేకూరు గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని పాము కాటు వేసిందన్న అనుమానం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన మంగళవారం కళాశాలను పరిశీలించారు. విద్యార్థి నిద్రించిన డార్మెంటుతో పాటు కళాశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించారు. అయినప్పటికీ పాములుపట్టే వారిని పిలిపించి పరిశీలించాలని వైఎస్ ప్రిన్సిపాల్ వీర ప్రతాప్‌ను ఆదేశించారు. రాత్రి సమయంలో విద్యార్థులు బయటి ప్రదేశాల్లో తిరిగారా అన్న విషయాన్ని సీసీ కెమెరాల ఫుటేజీలో పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రమేష్ బాబు, కళాశాల సిబ్బంది ఉన్నారు.


కళాశాలలో సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై కేంద్ర బృందం సర్వే

కోడుమూరు రూరల్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో భాగంగా లబ్ధిదారులకు అందుతున్న ఆర్థిక అంశాలు, ఆరోగ్య సేవలపై నేషనల్ ఫ్యామిలీ హెల్త్ బృందం సభ్యులు మంగళవారం కోడుమూరులో సర్వే నిర్వహించారు. సచివాలయం-3, 4వ పరిధిలోని చిన్నబోయవీధి, జీతూరి వీధి, కొత్తపేటలలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ బృందం సభ్యులు రాజేశ్వరీ, సరోజిని, వరలక్ష్మి, వసుంధర, శ్రీను పర్యటించి ఆరోగ్య సేవలు ప్రజలకు ఏ స్థాయిలో అందుతున్నాయో తదితర వాటిపై సర్వే నిర్వహించారు. బృందం సభ్యులు మాట్లాడుతూ ఇది కేవలం ఆరోగ్య సేవలకు సంబంధించిన సర్వే అని, ఎంపిక చేసిన 22 ఇళ్లను సర్వే చేసి, సమాచారాన్ని బట్టి ప్రభుత్వ ఆరోగ్య సేవలను మరింత పటిష్టం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నాలుగు రోజుల పాటు పట్టణంలో సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి హేమసుందరం, ఎంపీహెచ్‌ఈఓలు నరసప్ప, వేణుగోపాల్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.


సర్వే నిర్వహిస్తున్న నేషనల్ ఫ్యామిలీ హెల్త్ బృందం సభ్యులు

నాడు-నేడు పనులు నాణ్యతగా చేపట్టాలి


సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు

ఓర్వకల్లు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రెండో విడత కింద జరుగుతున్న నాడు-నేడు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ-2 ఓంకార్‌యాదవ్ అధ్యక్షతన హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో నాడు-నేడు పనులపై జరిగిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. మంజూరైన పనులకు తీర్మానాలు పూర్తిచేసి, సకాలంలో పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించేలా చూడాలని పేర్కొన్నారు. ఎంఈఓ ఓంకార్‌యాదవ్ మాట్లాడుతూ, నాడు-నేడు కింద మంజూరైన పనులకు సంబంధించి పూర్తి చేసిన పనులు, పెండింగ్ పనుల వివరాలను సమగ్రంగా అందజేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. అదేవిధంగా టీఈఓ ద్వారా సరఫరా చేసిన ఐరన్, ఇసుక, ఇటుకలు తదితర వివరాలపై చర్చించారు.

ఆరోగ్య సేవలను పకడ్బందీగా అమలు చేయాలి

ఓర్వకల్లు: ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య సేవలను పకడ్బందీగా అమలు చేయాలని మండల విస్తరణ అధికారి రాబర్ట్ అన్నారు. మంగళవారం మండలంలోని శకునాల గ్రామంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన సర్వే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతున్నాయా? లేదా అని అంచనా వేయడం కోసం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు సర్వే బృందం తెలిపింది. ప్రజలు సంతృప్త స్థాయిలో సమాధానం ఇచ్చినట్లు బృందం సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సు నిర్మలాదేవి, ఆరోగ్య సిబ్బంది రఘుబాబు, వేణుగోపాల్, కమాల్‌సాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్ ధానమ్మ, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వినీషా, ఆరోగ్య కార్యకర్త సుమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇంటింటీ సర్వే నిర్వహిస్తున్న వైద్య బృందం

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

కర్నూలు (హాస్పిటల్): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ విహారి, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాఘవేందర్ రెడ్డి సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి కారణాలు, లక్షణాలు, నివారణ, చికిత్స గురించి వివరించారు. దేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు ఎక్కువగా బాధ పడుతున్నారని, వాటిలో ఊపిరితిత్తులు, రొమ్ము, నోరు, గర్భాశయ, కడుపు, అన్నవాహిక, కాలేయ క్యాన్సర్లు ఉన్నాయన్నారు. కొన్ని జాగ్రత్తలతో ఈ క్యాన్సర్లకు దూరంగా ఉండవచ్చన్నారు. ఒక్కసారి క్యాన్సర్ వస్తే నిరంతరం అనారోగ్యంతో పోరాడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ నీలా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వైద్యులు

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కరువు మండలాల ప్రకటన అనంతరం పని దినాలను 100 నుంచి 150 రోజులకు పెంచినట్లు చెప్పారు. దీంతో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు గడప గడపకు-మన ప్రభుత్వం

పాణ్యం: కొండజుటూరు గ్రామంలో బుధవారం గడప గడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. ఉదయం 8గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందని, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని సూచించారు.

సి.బెళగల్: మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండా అందుబాటులో ఉండాలని సూచించారు.

స్కౌట్ అండ్ గైడ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ఓర్వకల్లు: మండల పొదుపు లక్ష్మి ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాల విద్యార్థులు స్కౌట్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ కనపరచినట్లు ప్రిన్సిపాల్ క్లమేట్ సత్యబాబు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు తెలిపారు. అందుకుగాను నూతన యూనిఫామ్‌లతో అభినందించినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ తదిరులు పాల్గొన్నారు.

రేపు దేవదాయ శాఖ కమిషనర్ రాక

కర్నూలు కల్చరల్: దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఈనెల 9న కర్నూలు రానున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు తెలిపారు. ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్, ఆర్‌జేసీ ఎస్‌వీఎస్ మూర్తి, కర్నూలు జోన్ డిప్యూటీ కమీషనర్ పట్టెం గురుప్రసాద్‌తో కలిసి రాయలసీమ జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు, ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, మండల ఇన్‌చార్జ్‌లతో రాయలసీమలో దేవదాయ శాఖ భూములు, ఆలయాల ఆస్తుల పరిరక్షణపై సమీక్ష చేయనున్నారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రాయలసీమ జిల్లాల్లోని అర్చకుల సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి మార్గదర్శనం చేస్తారని తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


లబ్ధిదారులకు రూ. 5 లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేద ప్రజలందరి అభ్యున్నతికి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తూ సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఉలిందకొండ గ్రామానికి చెందిన చాకలి చిన్నమద్దయ్య దంపతులకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 5,00,000 (ఐదు లక్షల రూపాయాల) చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, విద్యారంగాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఆరోగ్య శ్రీ వర్తించని రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల మాదిరిగానే పార్టీలు, కులాలు, వర్గాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తూ ప్రజల గుండెలో నిలిచిపోయారన్నారు. ఎమ్మెల్యే కాటసానితోపాటు గ్రామ నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, శీన్నయ్య, మత్స్యకారుల సంఘం రాష్ట్ర వైఎస్ ప్రసిడెంట్ శ్రీనివాసులుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈసీజీ సేవలు



గడివేముల పీహెచ్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జబీన్

గడివేముల: మండల కేంద్రం గడివేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈసీజీ మిషన్ అందుబాటులో ఉందని, ఈ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మొల్లా జబీన్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షల నిమిత్తం నంద్యాల, కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. అయితే ప్రస్తుతం ఆసుపత్రిలో ఈసీజీ మిషన్ అందుబాటులోకి వచ్చిందని, ఈ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా 4,607 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 123 మందిని మెరుగైన వైద్య సేవల కోసం రెఫర్ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా 1,202 మంది అవ్వతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి 553 మందికి అద్దాలు అవసరమని గుర్తించామని, త్వరలో పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ మహేశ్వరరెడ్డి, పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్‌లో జాగ్రత్తలు పాటించాలి


కౌలురు టపాసుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు, ఆర్డీఓ శ్రీనివాసులు

పాణ్యం: టపాసులు గోడౌన్‌ల వద్ద జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని నంద్యాల జిల్లా ఏఎస్పీ వెంకటరాముడు, ఆర్డీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. మంగళవారం కౌలురు, కొండజుటూరు గ్రామాల వద్ద ఉన్న టపాసులు గోడౌన్‌లను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వహకులు తప్పకుండా విక్రయాలు జరిపే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం గోడౌన్ ఆవరణ, నీటి వసతి, ఫైర్ సర్టిఫికెట్, లైసెన్స్‌లు, గోడౌన్‌లో ఉండాల్సిన నిల్వలు, పాటించవాల్సిన జాగ్రత్తలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎస్ఐ అశోక్, ఆర్ఐ మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండజుటూరు టపాసుల గోడౌన్ సీజ్

కొండజుటూరు గ్రామం వద్ద ఉన్న టపాసుల గోడౌన్‌లోనే రెండు చోట్లా టపాసులు నిల్వ ఉంచారు. అనుమతి ఉన్న గోడౌన్‌లో 500కేజీల టాపాసులు అనుమతి ఉండగా అంతకు మించి నిల్వ ఉండడం, మరో గోడౌన్‌లో అనధికారికంగా నిల్వ ఉంచినందుకు సీజ్ చేశారు.

అన్నదాతకు భరోసా

- గడివేముల మండలంలో రైతుభరోసాకు 7165 మంది అర్హులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

గడివేముల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుంది. పెట్టుబడి సాయం నుంచి దిగుబడుల విక్రయం వరకు అన్నదాతకు ప్రభుత్వం అండగా నిలుసుంది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లకు ముందుగానే రైతుల పెట్టుబడికి ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా ఆర్థికసాయం అందిస్తోంది. రైతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా రూ.13,500 వ్యక్తిగత ఖాతాలలో చేస్తుంది ప్రభుత్వం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో కర్షకుల కష్టాలు చూసి చలించి పోయి రైతుభరోసా ద్వారా ఆర్థికంగా అండగా ఉంటానన్న హామీ మేరకు వరుసగా ఐదో ఏడాది రెండో విడత డబ్బులను రైతుల అకౌంట్లలో జమ చేశారు. ఈ మేరకు మంగళవారం రూ.4 వేలు చొప్పున సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి రైతుభరోసా నగదు విడుదల చేశారు. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రదర్శించారు. 2019 అక్టోబర్ 15 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీఎం కిసాన్-వైఎస్సార్ రైతుభరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో ఖరీఫ్‌నకు ముందు రూ.7,500, రబీ సాగు అవసరాల కోసం రూ.4 వేలు, ధాన్యం ఇంటికి చేరే సంక్రాతి సమయాన జనవరిలో రూ.2 వేలు జమచేస్తూ రైతన్నలు ఆర్థికంగా అండగా నిలుస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.


రబీ సీజన్‌లో మొక్కజొన్న విత్తనం వేస్తున్న దృశ్యం

మండలంలో 7165 అర్హులు

మండలంలోని 14 ఆర్బీకేలలో రైతుభరోసా నగదుకు 7,165 మంది రైతులు అర్హులు ఉన్నారు. కరిమద్దెల 943 మంది రైతులు, కొరటమద్ది - 280, కొర్రపోలూరు -650, గడిగరేవుల - 539, గడివేముల - 358, గని - 722, చిందుకూరు - 836, చెనకపల్లె - 676, తిరుపాడు - 278, దుర్వేశి - 252, పెసరవాయి - 485, బిలకలగూడూరు - 543, బూజునూరు - 453, మంచాలకట్ట ఆర్బీకేకు సంబంధించి 158 మంది రైతులు అర్హులుగా ఉన్నారు.

ప్రభుత్వ సాయం గొప్పది



గత ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోలేదు. గత నాలుగున్నర ఏళ్ల నుంచి ఏటా రైతుభరోసా రూ.13,500 చొప్పున తమ అకౌంట్లో జమవుతున్నాయి. ప్రభుత్వ సాయం గొప్పది. రబీ సీజన్‌లో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యపు ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మాట తప్పని నేతగా సీఎం జగన్ నిలిచారు.

-వెంకట నారాయణరెడ్డి, రైతు, బూజునూరు